# ప్రేమ

"దీన్ని అర్జంటుగా 'బ్లాక్' చేసి ఇవ్వాలి."

మాసిపోయిన గుడ్డతో చేతులు తుడుచుకుంటున్న చిట్టిబాబు పరిశీలనగా ఆమెవైపు చూశాడు.

ఆమె గొంతులో తీయదనం ఉన్నట్లే ఆమె అందంలో ఆకర్షణ ఉన్నదనిపించింది. అప్పుడే వయసొస్తున్న చిట్టిబాబుకి.

ఆమె చేతిలో ఏదో ఫోటో ఉంది.

"ప్రొప్రయిటర్ వెళ్ళిపోయారు....షాపు మూసేసి నేనూ వెళ్ళిపోవాలి. ఆ ఫోటో ఇచ్చేసి వెళ్ళండి. రేపు రాగానే చేస్తాం." ఆ ఫోటోవైపు చూస్తూ అన్నాడు.

ఒకసారి అసహనంగా తన చేతి వాచీ వైపు చూసుకుంది ఆ అమ్మాయి.

"తొమ్మిదిన్నరయిపోయింది....దగ్గర్లో మరెక్కడా బ్లాక్ మేకర్స్ లేరుకూడాను. ఇప్పుడెలామరి ?" స్వగతంలో అనుకున్నట్టుగా అంది ఆ అమ్మాయి.

ఆమె పరిస్థితి చిట్టిబాబుకి కొంచెం జాలి కలిగించింది. ఎంతో అవసరం అయివుండాలి. లేకపోతే షాపు మూసే వేళయిందని తెలిసినా అప్పటికప్పుడు ఆ బొమ్మను బ్లాక్ చేయించుకోవాలని ఎందుకొస్తుంది?

"మా ప్రొప్రయిటర్ ఉండి ఉంటే ఆయనను ఎలాగైనా

ఒప్పించి ఎంత ఆలస్యమైనా తయారుచేసి ఇచ్చేవాణ్ణి...." చిట్టిబాబు కూడా స్వగతం అనుకున్నట్టై అన్నాడు.

"మరెలా? నీకు పుణ్యం ఉంటుంది. కావాలంటే పాతిక రూపాయలు ఎక్కువయినాసరే ఇస్తాను." ఆమె మాటల్లోని అర్థింపు చిట్టిబాబు మనసును లొంగదీసుకుంది. రెండు క్షణాల్లో ఓ నిర్ణయానికి వచ్చేశాడు.

యజమాని పర్మిషన్ లేదన్న మాటే కానీ, తాను ఆ బ్లాక్‌ను రెండు మూడు గంటల్లో చేయలేకపోడు. మర్నాడు ప్రొప్రయిటర్ గారికీ జరిగిన విషయం చెప్పి, ఆ డబ్బు చేతిలో పెడితే ఆయనమాత్రం ఏమంటాడు కనక?"

అందుకే ఆమె యిచ్చిన ఫోటోను తీసుకొని ఆమెకు కుర్చీ చూపించి కూర్చోమన్నాడు.

ఒకసారి ఆ ఫోటోలోకి నిశితంగా చూశాడు చిట్టిబాబు.... అది అందమైన కుక్కపిల్ల ఫోటో.... ఒంటినిండా ఒత్తుగా పట్టులాంటి తెల్లని బొచ్చు....నుదుట కస్తూరి తిలకంలా తేనెరంగునామం. ఫొటోలో కుక్కపిల్ల చూడముచ్చటగా వుంది.

"బ్లాక్‌లో బొమ్మ బాగా స్పష్టంగా రావాలి....ఉన్నదునట్టుగా పడాలి సుమా." చిట్టిబాబు పని ప్రారంభించాక అతణ్ణి ఓసారి హెచ్చరించింది ఆ అమ్మాయి.

రాత్రికి రాత్రి అంత అర్జంటుగా ఆ కుక్కపిల్ల బ్లాక్‌తో ఆమెకు ఏం పని వచ్చిందో అర్థంచేసుకోలేకపోతున్నాడు చిట్టిబాబు. కారణం

తెలుసుకోవాలనే కుతూహలం అతని మనసంతా ఆక్రమించగా దాన్ని అణచుకోలేక ఆమెను అడిగేశాడు.

"మా ప్రేమ ఇవాళ పొద్దుట్నుంచీ కనిపించటంలేదు. పోలీసు రిపోర్టిచ్చాం....మా డాడీ మనుషుల్ని పంపించి ఊరంతా వెతికించారు. ఎక్కడా కనిపించలేదు. అందుకే పేపర్లో దీని బొమ్మ వేయించి "కనిపించుటలేదు" అని ప్రకటన ఇస్తున్నాం. ఎవరికైనా దొరికితే తెచ్చి ఇస్తారని. తెచ్చినవారికి నూటపదహార్లు బహుమతి కూడా ప్రకటిస్తున్నాం." ఆ అమ్మాయి చెప్పింది.

"ఈ కుక్కపిల్లపేరు ప్రేమాండీ ?" అడిగాడు.

"ఔను. నేనే పెట్టాను ఆ పేరు....బాగుంది కదూ ?" అడిగింది.

"మరి మీ పేరేమిటండీ ?"

"రాగిణి".

"మీ పేరుకూడా బాగుంది."

"మోహన్‌కూడా అలాగే అంటాడు...." ఆమె అలా చెబుతుంటే ఆమె కళ్ళు ఉత్సాహంతో మెరిశాయి.

మోహన్ ఆమెకు కాబోయే భర్త అని చిట్టిబాబు అర్థం చేసుకున్నాడు.

"ఆయన ఏం చేస్తారండి ?" అడిగాడు.

"స్విట్జర్‌లాండ్‌లో పెద్ద ఉద్యోగం చేస్తున్నాడు. వచ్చే నెలలోనే మా పెళ్ళి." రాగిణి బుగ్గలు సిగ్గుతో ఎర్రబడ్డాయి....

"అసలు ఈ ఫోటోను పేపరుకు పంపిస్తే వాళ్ళే బ్లాక్ చేయించుకుంటారు కదండి." కొన్ని నిమిషాల తర్వాత చిట్టిబాబు అడిగాడు తన పని తాను చేసుకుంటూనే.

"నిజమేననుకో. కానీ ఆ పేపరు వాళ్ళ దగ్గర బ్లాక్సు చేసే మిషన్ చెడిపోయిందట. అందుకే ఏకంగా బ్లాకు చేసి. పొద్దున్నే పేపరు వాళ్ళకు ఇచ్చేస్తే. రేపు సాయంత్రం ఎడిషన్‌లో వేసేస్తారు. పనిలో పని. కొన్ని పాంప్లెట్స్ కూడా వేయించి పంచిపెట్టటానికి వీలుంటుందని."

ఆ కుక్కపిల్లంటే రాగిణికి ఎంత ఇష్టమో చిట్టిబాబు అర్థంచేసుకోగలిగాడు.

"కొన్ని కొన్ని వస్తువులకూ, కొందరు మనుషులకూ. అలాగే జంతువులకూ ఒక్కొక్క సమయంలో అనుకోకుండా విలువలు పెరిగిపోతాయి కాబోలు" అనుకున్నాడు.

ఆమెతో ఏవేవో కబుర్లు చెబుతూనే తొందరగా పని పూర్తి చేశాడు చిట్టిబాబు. బ్లాకు లో బొమ్మకూడా అందంగానే వచ్చింది. చెప్పిన ప్రకారం దాన్ని తయారుచేసినందుకు ఇచ్చే చార్జీతోపాటు మరో పాతిక రూపాయలుకూడా ఎక్కువ ఇచ్చింది రాగిణి.

"మీ కుక్కపిల్ల తప్పకుండా దొరుకుతుంది. దొరికిన తర్వాత నాకూ చెప్పండి" డబ్బు తీసుకుని చొక్కా జేబులో పెట్టుకుంటూ అన్నాడు.

"తప్పకుండా చెబుతాను. చెప్పటమే కాదు, నీకు మంచి బహుమతికూడా ఇస్తాను" అంటూ ఆ బ్లాక్ తీసుకుని వెళ్ళిపోయింది రాగిణి.

షాపు మూసేసి తనుకూడా బయలుదేరాడు.

ఊరికి దూరంగా ఓ గది అద్దెకు తీసుకుని ఉంటున్నాడు చిట్టిబాబు. రెండో ఆట సినిమా వదిలే సమయానికి తన గదికి చేరుకున్నాడు. పొద్దున్న వండుకుని తినగా మిగిలిన అన్నంలో పచ్చడి ఏదో వుంటే కలుపుకుని తినేశాడు. తరవాత రెండుగ్లాసులు మంచినీళ్ళు తాగి చాపపరుచుకుని పడుకున్నాడు.

వెంటనే నిద్రపట్టలేదు.

అంతకు ముందు తన షాపుకి వచ్చిన రాగిణి, పోయిన ఆమె కుక్కపిల్ల గుర్తుకువచ్చారు. ఎక్కడో పుట్టిన కుక్కపిల్లను ఆమె తెచ్చి రెండేళ్ళో, మూడేళ్ళో పెంచుకుంది.... ఈ రెండుమూడేళ్ళలోనే దానిపై అంతగా ప్రేమానురాగాల్ని పెంచుకుందికూడా. అందుకే ఆ కుక్కపిల్ల తప్పిపోతే ఆమెకు అంతగా బాధ కలిగి ఉంటుంది.

అయితే. తనను నవమాసాలూ మోసి, కని, పదిహేనేళ్ళపైగా పెంచిన తన తల్లి, ఇంతకు పది రెట్లు తనకోసం బాధపడి ఉండాలి....

అవును బాధపడి ఉంటుంది.

తను ఇట్లోంచి పారిపోయివచ్చి మూడేళ్ళయింది. ఈ మూడేళ్ళలోనూ కనీసం ముప్పైమూడు సార్లయినా తనకు ఇంటికి వెళ్ళిపోవాలనిపించింది. తన తల్లి అన్నం పెడుతూంటే, ఆమె కళ్ళలోకే చూస్తూ, ఆకలి తీరేలా తినాలనిపించింది.

కానీ అభిమానం అడ్డువచ్చింది.... అసలు ఆ అభిమానమే తనను ఇంతదూరం లాక్కొచ్చింది.

రైల్వే స్టేషన్‌లో పోర్టరుగా పనిచేస్తాడు తన తండ్రి....

ఎలాగో కష్టపడి తనకు చదువు చెప్పించాడు. కానీ పదోక్లాసు పరీక్షలో తాను ఫెయిలయ్యాడు. 'తన శ్రమంతా బూడిదలో పోసిన పన్నీరయిందని తండ్రి విసుక్కున్నాడు. అలా విసుక్కుంటూనే, మళ్ళీ ప్రైవేటుకూడా పెట్టించి, పరీక్షకు చదివించాడు.... రెండోసారీ పరీక్ష పోయింది. 'ఎందుకూ పనికిరావు పొమ్మ'న్నాడు తండ్రి.... ఇంకా చాలా మాటలన్నాడు. అమ్మ ఏదో సర్దిచెప్పబోతే ఆ కోపంతో నాన్న అమ్మను కొట్టిండుకూడా....

ఆ దెబ్బలన్నీ తన అభిమానం మీదనే పడినట్లనిపించింది. ఇంట్లో చెప్పకుండా ఆ రాత్రే బయల్దేరి పట్నం వచ్చేశాడు. వచ్చిన రెండు రోజులు హోటల్లో సర్వరు పనైనా దొరక్క పోతుందా అని తెగ తిరిగాడు.... అదృష్టం బాగుండి 'బ్లాక్స్' తయారుచేసే కంపెనీలో చిన్న ఉద్యోగం దొరికింది. ఆకలి తీరీ మార్గం కనిపించింది.

జీవితమంటే అదేకాదని తెలిసినా, జీవించటానికి ఏదోఒకటి చేయాలికనుకా, ఎక్కడో ఒకచోట స్థిరపడాలి కనుకా నమ్మకంగా పని నేర్చుకున్నాడు. కష్టానికి, కన్నీటికి ఓర్చుకున్నాడు. ప్రొప్రయిటర్ అభిమానాన్ని పొందగలిగాడు.

కానీ ఈ మూడేళ్ళలోనూ తన తల్లీ, తండ్రి తన గురించి ఎలాంటి ప్రయత్నమూ చేయలేదని మనసులో అనిపించేసరికి అతని అభిమానంపై ముల్లు గుచ్చుకున్నట్టే అయింది.

నిజంగా తన మీద వాళ్ళకు ప్రేమ వుంటే తన గురించి ఎలాగో అలా పేపర్లో వేయించేవారు. పోలీసు రిపోర్టిచ్చి ప్రతి చోటా వెతికించేవారు....

ఆఖరికీ రాగిణి తన కుక్కపిల్లమీద చూపించిన ప్రేమను తన వాళ్ళు తన మీద చూపించలేకపోయారు.

రెండేళ్ళు పెంచిన కుక్కపిల్లపోతే రాగిణి ఎంతో విలపించింది. పదహారేళ్ళు పెంచిన తన 'కన్నతల్లి' చనకోసం తల్లడిల్ల లే దెందుకని?

"వచ్చే జన్మ ఉంటే ఇలా అభిమానం, అంతఃకరణ లేనివాళ్ళ కడుపున పుట్టేకన్నా కలవారింట్లో కుక్కపిల్లగా పుడితే నయం" అనుకున్నాడు చిట్టిబాబు. అలా అనుకుంటూంటే అప్రయత్నంగానే తన కళ్ళల్లోకి కన్నీరు ఉప్పెనలా వచ్చింది. ఉప్పెనలా వచ్చిన ఆ కన్నీటి తెరల వెనుక అమ్మ రూపం మసక మసకగా కనిపించింది.

'ఒకసారి అమ్మను చూస్తే బాగుణ్ను' మళ్ళీ అనుకున్నాడు చిట్టిబాబు.

కానీ ఎలా....? ఇంటికి వెళ్ళాలంటే రైలు టిక్కెట్లకే పాతిక రూపాయలు కావాలి. ఇన్నేళ్ళ సంపాదనకు ఆనవాలుగా అమ్మకు ఒక చీరయినా కొని తీసుకెళ్ళాలి...అంటే మరో ఇరవై రూపాయలు ....మొత్తం ఎంతలేదన్నా యాభై రూపాయలు కావలి.

"తనకు వచ్చే జీతం తన అవసరాలకే పూర్తిగా చాలదు. ఇలాంటి ఖర్చుల్ని అందులోంచి ఎలా భరించటం ?

ఆలోచిస్తున్నకొద్దీ తనకూ, తనవాళ్ళకు మధ్య పెద్ద అగాధం లాంటిది ఏర్పడుతున్నట్టూ అందులోకి తాను జారిపోతూ చల్లని చేయూత కోసం నిస్సహాయంగా పైకి చూస్తున్నట్టూ అనిపించసాగింది చిట్టిబాబుకి.

లకత నిద్రతోనే ఆ రాత్రి గడిపేశాడు.

మూడోరోజు సాయంత్రం నాలుగు గంటల వేళ తన కంపెనీ ముందు కారు ఆగటంతో పనిలో ఉన్న చిట్టిబాబు ఆసక్తిగా రోడ్డుమీదకు చూశాడు. కారులోంచి రాగిణి దిగి లోపలకు వచ్చింది. ఆమె వెనకాలే అందమైన కుక్క-పిల్లకూడా లోపలకు వచ్చింది. దాన్ని చూడ గానే చిట్టిబాబు గుర్తుపట్టేడు. ఆ కుక్క-పిల్ల ఫోటోను తాను బ్లాకు చేశాడు.... అంటే.... ఆమె 'ప్రేమ' ఆమెకు దొరికిందన్నమాట.

ఆమె కళ్ళలో ఎంతో ఉత్సాహం కొట్టొచ్చినట్టు కనిపిస్తూంది. గబగబా ఆమెకు ఎదురువెళ్ళి చిరునవ్వుతో ఆమెను ఆహ్వానించాడు.

"మొన్న రాత్రి పాతిక రూపాయలు ఎక్కు-విచ్చి కుక్క-పిల్ల బ్లాక్ చేయించుకొని వెళ్ళారని చెప్పాను చూడండి-ఆ రాగిణిగారు వీరే!" తన ప్రొప్రయిటర్‌కు పరిచయం చేశాడు.

"ప్రొసెస్ మూసేసే సమయానికి వచ్చి అడిగేను. పాపం.... శ్రమ అనుకోకుండా చేసి ఇచ్చాడు. బ్లాకు కూడా బాగా వచ్చింది. మంచి మనసుతో చేసి ఇచ్చాడు కనుకనే ఇవ్వాళ మధ్యాహ్నం మాకుక్క-పిల్ల మాకు దొరికింది." మెచ్చుకోలుగా ప్రొప్రయిటర్‌తో అంది రాగిణి.

"నిజమే, మేడమ్! అతను వచ్చి మూడేళ్ళయినా కాలేదు. పనంతా క్షుణ్ణంగా నేర్చేసుకున్నాడు. అతని ముందు చెప్పకూడదుకానీ, చాలా నమ్మకంగా పనిచేస్తాడు. పని అంతా అతనిమీద వదిలివెళ్ళినా నా కెలాంటి ఇబ్బంది వుండదు." ప్రొప్రయిటర్ మాటలకు చిట్టిబాబు కళ్ళల్లో గర్వం తొణికిసలాడింది.

గిరాణి తన పర్సులోంచి మూడు పదికాగితాలు తీసి చిట్టిబాబు

కందిస్తూ, "మా ప్రేమ దొరికితే బహుమతి ఇస్తానన్నాను. ఇదిగో.... అన్న మాట ప్రకారం ముప్ఫైరూపాయలు ఇస్తున్నాను. మంచి చొక్కా కుట్టించుకో" అంది.

మనసులో తీసుకోవాలనే అనిపించినా, ప్రొప్రయిటర్ ఏమైనా అనుకుంటాడనో, మరే కారణం చేతనో చిట్టిబాబు కొంచెం మొహమాట పడ్డాడు.

"ఫరవాలేదులే. నా సంతోషం కొద్దీ ఇస్తున్నాను. కుక్కపిల్లను తెచ్చి ఇచ్చిన వాళ్ళకుకూడా నూటపదహార్లు బహుమతి ఇచ్చాం. దాని ముందు ఈ ముప్పైఎ చాలా తక్కువే. తీసుకో" అంటూ చిట్టిబాబు చేతిలో ఆ ముప్పై రూపాయలూ పెట్టేసింది. ఆ తరవాత ప్రొప్ర యిటర్ దగ్గర సెలవు తీసుకొని తన ప్రేమతోసహా మళ్ళీ కారెక్కి వెళ్ళిపోయింది రాగిణి.

"ఏ మనిషి ఏ వృత్తిలో ఉన్నా, నైపుణ్యంతో పనిచేయటం, నమ్మకంతో పనిచేయటం అలవరుచుకుంటే తప్పక పైకొస్తాడు." రాగిణి వెళ్ళిపోయాక చిట్టిబాబుతో అన్నాడు ప్రొప్రయిటర్. అదే సమయమనుకున్న చిట్టిబాబు తన మనసులోని మాట చెప్పేశాడు.

"నాలుగు రోజులు సెలవిస్తే ఒక్కసారి మాఊరు వెళ్ళివస్తాను, సార్" అన్నాడు.

"ఏం ? మీ అమ్మను చూడాలని వుందా ?" నవ్వుతూ అడిగాడు ఆయన.

"అవును, సార్. అప్పుడే అమ్మనూ నాన్ననూ చూసి మూడే ళ్ళయింది. ఇన్నాళ్ళూ చేతిలో డబ్బులేక వెళ్ళలేదు. ఇప్పుడు రాగిణి

గారు ముప్పైరూపాయలు ఇచ్చారు. మీరు కూడా ఇంకో పాతికరూపాయలు ఇస్తే వచ్చే నెల జీతంలో మినహాయించుకోవచ్చు. నేను మళ్ళీ నాలుగు రోజుల్లో వచ్చేస్తాను...."

ప్రొప్రయిటర్ మరేమీ మాట్లాడలేదు.

టేబులు సొరుగులోంచి పాతిక రూపాయలు తీసి అతని చేతిలో పెట్టాడు.

"ఇదిగో, ఈ పాతికా నీకు 'బోనస్'గా ఇస్తున్నాను. మళ్ళీ ఇవ్వక్ఖర్లేదు అన్నాడు.

ఆ మూడేళ్ళూ లేని తొందర చిట్టిబాబుకి ఆ క్షణంలోనే వచ్చేసింది. ప్రెస్ మూసే సమయానికి ఓ గంట ముందే బయలుదేరి అమ్మకోసం ఇరవై రూపాయలుపెట్టి బజార్లో చీరకొన్నాడు. ఆకలి లేకపోయినా హోటల్‌కి వెళ్ళి టిఫెన్ తిని రాత్రి పన్నెండుగంటలకు వాళ్ళ ఊరెళ్ళే రైలెక్కాడు.

తెలతెలవారుతూండగా వాళ్ళ ఊళ్ళో రైలు దిగిన చిట్టిబాబు పరుగులాంటి నడకతో తన యింటి ముందుకొచ్చి తలుపు తట్టాడు.

"ఎవరు?" అంటూ ఆవులిస్తూ వచ్చి తలుపు తీసిన ఆమె మెడ చుట్టూ హఠాత్తుగా చేతులు బిగించి 'అమ్మా' అని కౌగలించుకున్నాడు.

"ఛీ....ఎదవ సచ్చినోడా. ఎవడ్రా నువ్వు?" పురుగును విదిలించినట్టు విదిలించి పారేసింది ఆమె.

ఆ గొంతు తన తల్లిది కాదు.... ఆ స్పర్శ తన మాతృమూర్తిది కాదు.

తుళ్ళిపడిన చిట్టిబాబు మసక వెలుతురులో ఆమె వైపు పరిశీల నగా చూశాడు.

నిజమే.... ఆమె తన తల్లి కాదు....

"ఎవరు నువ్వు ? ఇక్కడ మా అమ్మ వుండాలి. ఏమయిందీ?" భయమూ, ఆందోళన మిళితమైన గొంతుతో అడిగాడు ఆమెను.

ఈ హడావిడికి మెలకువ వచ్చిన చిట్టిబాబు తండ్రి అంతలోనే అక్కడకు వచ్చాడు.

"వచ్చావురా సిట్టిగా? ఇంతకాలానికి నీ ఇల్లు నీకు గేపకానికి వచ్చిందట్రా.... కానీ అంతా అయిపోయిందిరా సిట్టిగా."

వస్తున్న దుఃఖాన్ని మింగుతూ తనను దగ్గరకు తీసుకుంటున్న తండ్రిని చూడగానే చిట్టిబాబు గొంతు మూగబోయింది.

"అయ్యా !" ఎలాగో గొంతు పెగుల్చుకున్నాడు.

"అవున్రా.... నేను టేసన్లో కూలి పని చేసుకుంటున్నా, నిన్ను టేసిన్‌మాట్టర్ని సెయ్యాలని నేను ఎన్నోమార్లు అనుకున్నా.... అందు కేరా, నిన్ను చదివించింది. కానీ, నువ్వేమో మూడుసార్లు పేలయ్యావ్. కోపం రాదట్రా ?.... ఆ కోపంలో తిట్టానే అనుకో.... అందుకని సెప్పా సెయ్యకుండా ఎల్లిపోటమేనట్రా ? సూశావా ?.... ఇప్పుడేం జరిగిందో?" అలా చిన్న పిల్లాడిలా బేలగా తన తండ్రి మాట్లాడటం తా నెప్పుడూ చూడలేదు.

కానీ ఇప్పుడలా మాట్లాడుతుంటే వయసులో తాను పెద్దవాడయి నట్టుగా భావన కలిగింది చిట్టిబాబుకి. ఏదో చెప్పాలనీ, మరేదో అడ

గాలనీ అనుకున్నాడు. కానీ అందుకు వీలు లేకుండా తన తండ్రి తనను గట్టిగా కౌగలించుకుని—

"ఒరేయ్, సిట్టిగా! మీ అమ్మ సచ్చిపోయిందిరా" అన్నాడు. చిట్టిబాబు తుళ్ళిపడ్డాడు.

"అప్రనా సిట్టిగా! పరిచ్చ పోయిందని తిడితేనే నీకు అంత కోపమొచ్చింది కదట్రా! కానీ ఎన్నోసార్లు నేను సారా మానేసి నీకు పుస్తకాలు కొన్నాను. జీతాలు కట్టాను. టూషనుకు డబ్బులు కట్టాను. అయినా నువ్ పేలయ్యావ్. మరి కోపం రాదట్రా నాకు. అలా అన్నానని నువ్వెల్లిపోతే చూశావా....ఏం జరిగిందో? మీ అమ్మ సచ్చిపోయింది...నీ కోసం బెంగపెట్టుకుని మరీ సచ్చిపోయిందిరా..."

"అయ్యా!" చిట్టిబాబు గుండెల్లో పేరుకుపోయిన ప్రేమా-వాత్సల్యం-అభిమానం అన్నీ తన తండ్రి మాటల వేడికి కరిగి కన్నీరుగా మారిపోయింది. అతని గొంతు మూగపోయింది.

తను ఇంట్లోంచి పారిపోగానే తన తల్లి బెంగతో మంచంపట్టింది. మనోవ్యాధికి మందులుమాత్రం ఏం పనిచేస్తాయి? మూడు నెలలు అలాగే మంచంపై జీవచ్ఛవంలా పడివుండి, కళ్ళల్లో వత్తులు వేసుకుని తనకోసం ఎదురుచూసింది. తన తండ్రి తనకోసం పోలీసు రిపోర్టు ఇచ్చాడు. బంధువు లింటికి కబుర్లు పంపించాడు. మూడు నెలలయినా తాను తిరిగి రాకపోయేసరికి పరీక్ష పోయిన కుర్రాళ్ళు కొందరు అభిమానంతో ఆత్మహత్య చేసుకున్నట్టే బహుశా తన కొడుకూ ఆత్మహత్య చేసుకొని వుంటాడని తన తల్లి తలపోసింది. తనకోసం కలవరిస్తూనే కన్నుమూసింది... ఆ తరవాత మరో ఆర్నెల్లకు ఒంటరి

వితాన్ని భరించలేకనో-వంశం నిలబడేందుకు మరో మనువు అవసర మనో తన తండ్రి మళ్ళీ పెళ్ళిచేసుకున్నాడు.

ఇవి చిట్టిబాబుకి చుట్టుపక్కలవాళ్ళు చెప్పిన సంగతులు.

తన తల్లి లేని ఆ ఇంట్లో మరి ఉండలేకపోయాడు చిట్టిబాబు. ఆ సాయంత్రమే మళ్ళీ ప్రయాణమయ్యాడు.

"కావాలంటే నిన్ను మళ్ళీ చదివిస్తాను కానీ ఇక్కడే వుండిపోరా-సిట్టిగా" అన్నాడు తండ్రి.

"నేను మాత్రం నీకు అమ్మను కాదేంటీ? ఉండిపో. మాకూ సాయంగా వుంటావు" అంది సవతి తల్లి.

కానీ ఎవరెంత చెప్పినా వుండాలనిపించలేదు చిట్టిబాబుకి.. మూడేళ్ళుగా అలవాటయిన జీవితంలోకి వెడితేనే తప్ప తన తల్లిని మరిచిపోవటం సాధ్యం కాదనుకున్నాడు. తన తండ్రికి నచ్చచెప్పి రైలు ఎక్కేశాడు.....

‡ ‡ ‡

ఇరవై రోజులు గడిచిపోయాయి. తన తల్లి తన కింక లేదనే జ్ఞాపకాల తాలూకు దిగులునుండి కోలుకొన్న చిట్టిబాబు ప్రెస్సులో తన పనిని మామూలుగా చేసుకుపోతున్నాడు.

ఓ సాయంత్రం అయిదు గంటల వేళ కాఫీ తాగటానికి ప్రెస్సు లోంచి బయటకు వచ్చి దగ్గర్లో వున్న కాఫీ హోటల్‌కు వెడుతున్న చిట్టి బాబుకి అక్కడే ఉన్న బట్టల కొట్టులో రాగిణి కనిపించింది.

ఎవరో ఆత్మీయుల్ని చూసినంత సంబరపడ్డాడు. ఉత్సాహంతో

ఆమె దగ్గరకు వెళ్ళి పలకరించాడు....రాగిణికూడా ఎంతో సంతోషంగా కబుర్లు చెప్పింది....

"ఎక్కడికి బయలుదేరావు ?" తనకు కావలసిన చీరలు కొనుక్కొని బయటకు వచ్చిన తరువాత రాగిణి అడిగింది.

చిట్టిబాబు చెప్పాడు.

"అయితే పద. నేనూ కాఫీ తాగుతాను." చిట్టిబాబుని అనుసరించింది.

"మీరు హోటల్‌కి వస్తారా ?" ఆశ్చర్యంగా అడిగాడు చిట్టిబాబు.

"ఏం ? రాకూడదా ?.... అయినా నువ్వున్నావుగా. మనిద్దర్నీ చూసి అక్కా- తమ్ముళ్ళనుకుంటార్లే. మరేం భయంలేదు...." గలగలా నవ్వేసింది రాగిణి.

రాగిణి మాటలు విన్న తర్వాత గర్వం వల్లనో, తాను నోచుకోని మధురమైన అనుబంధం తాలూకు అనుభూతి వల్లనో, చిట్టిబాబు కళ్ళల్లో ఆనందభాష్పాలు చిప్పిల్లి క్షణంసేపు అతన్ని పారవశ్యంలో ముంచేశాయి.

"అన్నట్లు మీ ప్రేమ బాగుందా ?.... మీతో తీసుకురాలేదేం ? కాఫీ తాగుతూంటే అడిగాడు చిట్టిబాబు. ఆ ప్రశ్నకు రాగిణి వెంటనే సమాధానం చెప్పలేదు. ఆమె ముఖ కవళికలు వెంటనే మారిపోయాయి. "ప్రేమను అమ్మేశాను." కొన్ని క్షణాల తరవాత నెమ్మదిగా అంది రాగిణి ఎటో చూస్తూ.

"అవును. అమ్మేశాను. ఎవరు కొనకపోతే ఊరికే ఇచ్చేద్దా

మనుకున్నాను. అదీ వీలుపడకపోతే మునిసిపాలిటీవాళ్ళకు అంటగట్టే యాలనుకున్నాను,"

మాటలు కసిగా ఉన్నాయి,

'నెల రోజుల క్రితం ఓసారి ఆ కుక్కపిల్ల తప్పిపోతే ఎంతో హడావిడి చేసిన రాగిణి ఇప్పుడిలా మాట్లాడుతుందేమిటి అనుకున్నాడు' చిట్టిబాబు.

ఏదో అడగాలని తటపటాయిస్తుంటే రాగిణి మళ్ళీ చెప్పింది.

"నిన్ను ఎంతో ప్రేమిస్తున్నాను, నిన్నే పెళ్ళిచేసుకుంటాను" అని చెప్పిన మోహన్ నన్ను మోసం చేశాడు.... స్విట్జర్లాండులో ఎవత్తెనో పెళ్ళిచేసుకున్నాడట. తన మీద ఆశలు పెట్టుకోవద్దని ఉత్తరం రాశాడు....ఇదివరకయితే ప్రతి ఉత్తరంలోనూ ఎంతో ప్రేమ ఒలకపోసేవాడు. స్విట్జర్లాండ్ నుంచి ఎవరో వస్తుంటే వాళ్ళచేత నాకు ప్రేమకానుకగా ఆ కుక్కపిల్లను పంపించాడు. అందుకే దానికి 'ప్రేమ' అని పేరుపెట్టుకుని ఇరవైనాలుగు గంటలు ఎంతో ప్రేమతో కళ్ళల్లో పెట్టుకుని మరీ చూసుకున్నాను....అసలు ప్రేమంటే అర్థమూ, ప్రేమకున్న విలువా వాడికి తెలీదు...." ఉక్రోషంతో ఆమె అలా చెబుతూంటే చిట్టిబాబు ఆలోచిస్తూ ఉండిపోయాడు.

ప్రేమకు అర్థమూ. విలువా ఉన్నాయా?

అసలు ప్రేమంటే ఏమిటో?

తాను ఇట్లోంచి పారిపోయివస్తే తన గురించే బెంగపెట్టుకుని తన తల్లి మంచం పట్టి మరణించింది. అలా ఎందుకు బెంగపెట్టుకుంది? ...తన మీద ప్రేమ వల్లనా?...

తాను మళ్ళీ ఇంటికి వెళ్ళినప్పుడు 'నిన్ను మళ్ళీ చదివిస్తానుకానీ ఇక్కడే ఉండిపోరా' అని తన తండ్రి తనను దీనంగా అడిగాడు. అలా దీనంగా ఎందుకు అడగాలీ? తన మీద ప్రేమ వల్లనా?...

"మనిద్దర్నీ చూసి అక్కాతమ్ముళ్ళనుకుంటార్లే" అని అంతకు ముందు రాగిణి అన్నప్పుడు తనకదోరకమైన అనుభూతి కలిగింది. తన శరీరం రోమాంచితమై పులకరింత కలిగింది... కళ్ళల్లో ఆనంద భాష్పాలు చిప్పిల్లాయి. అలాంటి అనుభూతి ఎందుకు కలగాలి? ఒకరంటే ఒకరికి గల ప్రేమవల్లా?

అయితే ప్రేమలో ఏదో మహత్తుండే ఉండాలి. విశ్వాసానికి అందని అతీతమైన అర్థం ఏదో ప్రేమలో అంతర్లీనమై ఉండాలి. ప్రేమలో ఏదో శక్తి ఉండాలి.

నిజంగా ప్రేమలో ఇన్ని ఉంటే రాగిణిని అంతగా ప్రేమించిన మోహన్ ఆమెను మరచి మరో అమ్మాయిని ఎలా పెళ్ళిచేసుకోగలిగాడు?...

నిజంగా ప్రేమలో ఇన్ని వుంటే పదిహేనేళ్ళపాటు అమ్మతో కలసి కాపురం చేసిన నాన్న అమ్మ చచ్చిపోగానే ఆర్నెల్లయినా తిరక్కుండా మరో ఆడదాన్ని ఎలా పెళ్ళిచేసుకోగలిగాడు.

అసలు ప్రేమకు అర్థం ఏమిటి? ప్రేమలోని అంతరార్థం ఏమిటి?

"ఏమిటి ఆలోచనలో పడిపోయావ్?" కాఫీ తాగటం పూర్తిచేసి అక్కడ నుంచి లేస్తూ అడిగింది రాగిణి.

"మరేం లేదండీ. "ప్రేమకు అర్థం ఏమిటా?" అని ఆలోచిస్తున్నాను" అంటూ లేచి ఆమెను అనుసరించాడు చిట్టిబాబు

---

❋ ఆంధ్రప్రభ జూలై '1977'